

హుస్నాబాద్ పట్టణంలోని 13వ వార్డులో ఓటర్లకు బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను అందజేస్తున్న బీఆర్ఎస్ కౌన్సిలర్ బొల్లి కల్పన

## హుస్నాబాద్‌లో జోరుగా బీఆర్ఎస్ ప్రచారం

హుస్నాబాద్ టౌన్, నవంబర్ 22 : హుస్నాబాద్ పట్టణంలో బీఆర్ఎస్ అభ్యర్థి వొడితెల సతీశ్‌కుమార్‌కు మద్దతుగా వార్డుల్లో బుధవారం జోరుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టణంలోని 20వ వార్డుల్లో ఇంటింటి కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు ప్రచారం నిర్వహించారు. పట్టణంలో బీఆర్ఎస్ చేసిన అభివృద్ధిని వివరించారు. సతీశ్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని, బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను ఓటర్లకు అందజేస్తున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఎండీ అన్వర్, వర్కింగ్ ప్రెసిడెంట్ చిట్టి గోపాల్‌రెడ్డి, కౌన్సిలర్లు కొంకట నళినీదేవి, బోజు రమాదేవి, పెరుక భాగ్యారెడ్డి, గూళ్ల రాజు, బొల్లి కల్పన, జనగామ రత్నమాల, మిర్యాల రమేశ్, బొజ్జ హరీశ్, వాల సుప్రజ, మాజీ కౌన్సిలర్లు రాజయ్య, పచ్చిమట్ల ప్రతిభ పాల్గొన్నారు.

## కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రిని చేయాలి



వింజపల్లిలో వృద్ధురాలిని ఓటు అడుగుతున్న ఎంపీపీ కీర్తి

కోహెడ, నవంబర్ 22 : రాష్ట్రంలో సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు జరగాలంటే కారు గుర్తుకు ఓటు వేసి కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రిని చేయాలని ఎంపీపీ కొక్కుల కీర్తి అన్నారు. బుధవారం మండలంలోని వింజపల్లి గ్రామంలో ఏఎంసీ చైర్మన్ తిప్పారపు జ్యోతితో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీలకు ఓటు వేసి ఆగం కావొద్దన్నారు. వొడితెల సతీశ్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఇప్పరపల్లి కృష్ణమూర్తి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్‌కు శనిగరం ముదిరాజ్‌ల మద్దతు



శనిగరంలో బీఆర్ఎస్‌కు మద్దతు తెలుపుతున్న ముదిరాజ్‌లు

కోహెడ, నవంబర్ 22 : మండలంలోని శనిగరం గ్రామంలో బుధవారం బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి కర్ర శ్రీహరి, చిగురుమామిడి ఇన్‌చార్జి కర్ర రవీందర్, సర్పంచ్ కర్ర జయశ్రీ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సతీశ్‌కుమార్‌కు ముదిరాజ్ కులస్తులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో శనిగరం గ్రామ ముదిరాజ్‌లు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేపై తప్పుడు వ్యాఖ్యలు చేస్తే సహించం

బెజ్జంకి, నవంబర్ 22 : ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌పై గుండారం సర్పంచ్ లావణ్య తప్పుడు వ్యాఖ్యలు చేయడాన్ని ఖండిస్తున్నామని, అసత్య ఆరోపణలు చేస్తే సహించమని బీఆర్ఎస్ నాయకులు ఒక ప్రకటనలో హెచ్చరించారు. కాంగ్రెస్ నాయకులు సమావేశంలో ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌పై తప్పుడు వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. అన్ని రకాలుగా లబ్ధి పొంది పార్టీకి ద్రోహం చేసిన సర్పంచ్ మాట్లాడం విడ్డూరంగా ఉందన్నారు. అవసరానికి పార్టీ మారే నాయకుల మాటలు ప్రజలు నమ్మరని, ఇప్పటికైనా దిగజారుడు రాజకీయాలు మానుకోవాలని హితువు పలికారు.

## 'వొడితెల'ను భారీ మెజార్టీతో గెలిపించాలి

హుస్నాబాద్ రూరల్, నవంబర్ 22 : ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ కారు గుర్తుకు ఓటేసి సతీశ్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఎంపీపీ లకావత్ మానస అన్నారు. బుధవారం మండలంలోని మహ్మదాపూర్ గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందించిన ఘనత సీఎం కేసీఆర్‌దేనన్నారు. బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం బంగారు తెలంగాణగా మారిందన్నారు. గత ప్రభుత్వాల పాలనలో కరెంట్ కష్టాలు చూసిన ప్రతిఒక్కరూ గుర్తుంచుకొని 24 గంటల విద్యుత్ అందిస్తున్న బీఆర్ఎస్ కారు గుర్తుకే ఓటు వేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పిట్టల నవ్య, నాయకులు అలుమల్ల ప్రభాకర్‌రెడ్డి, ఇంతియాజ్ పాల్గొన్నారు.



హుస్నాబాద్ రూరల్ : మహ్మదాపూర్‌లో ఇంటింటి ప్రచారం చేస్తున్న ఎంపీపీ




## కాంగ్రెస్ నాయకుల మాటలు నమ్మొద్దు

బెజ్జంకి, నవంబర్ 22 : మానకొండూర్ బీఆర్ఎస్ అభ్యర్థి రసమయి బాలకిషన్‌కు మద్దతుగా మండలంలోని అన్ని గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 60 ఏండ్లు ప్రజలను అరిగోస పెట్టిన కాంగ్రెస్ నాయకుల మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టోపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ లింగాల నిర్మల, జడ్పీటీసీ కనగండ్ల కవిత, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ చంద్రకళ, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



మానకొండూర్ బీఆర్ఎస్ అభ్యర్థి రసమయి బాలకిషన్‌కు మద్దతుగా ప్రచారం చేస్తున్న మహిళా ప్రజాప్రతినిధులు

## బీఆర్ఎస్‌లో చేరికల జోష్

కోహెడ, నవంబర్ 22 : బీఎస్పీ రాష్ట్ర నాయకుడు కరీంనగర్ జిల్లా చొప్పదండి ఇన్‌చార్జి, న్యాయవాది మంద రవీందర్ ఆ పార్టీకి రాజీనామా చేశారు. మంత్రి హరీశ్‌రావు, హుస్నాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి వొడితెల సతీశ్‌కుమార్ సమక్షంలో మంగళవారం రాత్రి బీఆర్ఎస్‌లో చేరారు.



బీఎస్పీ రాష్ట్ర నాయకుడు కరీంనగర్ జిల్లా చొప్పదండి ఇన్‌చార్జి మంద రవీందర్‌కు గులాబీ కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న మంత్రి హరీశ్‌రావు

## పోలింగ్ నిర్వహణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి

### కేంద్ర ఎన్నికల సంఘం సీనియర్ డీఈసీ నితేశ్ కుమార్ వ్యాస్

సిద్దిపేట అర్బన్, నవంబర్ 22 : పోలింగ్ నిర్వహణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కేంద్ర ఎన్నికల సంఘం సీనియర్ డీఈసీ నితేశ్‌కుమార్ వ్యాస్ అన్నారు. బుధవారం ఢిల్లీ నుంచి ఉన్నతాధికారులతో కలిసి శాసన సభ ఎన్నికల ఏర్పాట్లపై జిల్లా ఎన్నికల అధికారులతో వీడియా కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ఓటరు సమాచార స్లిప్పుల పంపిణీ చేయాలన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఈవీఎం యంత్రాల ర్యాండమైజేషన్ పూర్తి చేసి, ఈవీఎం కమీషనింగ్ ప్రక్రియ ప్రారంభించాలన్నారు. పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేసి, వారికి అవసరమైన శిక్షణ అందించాలన్నారు. ఎన్నికల సమయంలో అక్రమ డబ్బు, మద్యం పంపిణీ జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. సీ విజల్ యాప్ వినియోగంపై విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. పట్టణ ప్రాంతాల్లో వంద శాతం, గ్రామీణ ప్రాంతాల్లో 60శాతం వెబ్ కాస్టింగ్ చేయాలన్నారు. ఎన్నికల ఉల్లంఘనలపై వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ మాట్లాడుతూ జిల్లాలో నాలుగు నియోజకవర్గాల్లో ఓటరు చీటీలు 70 శాతం పంపిణీ చేసినట్లు తెలిపారు. పోస్టల్ బ్యాలెట్, ఇంటి నుంచి ఓటు వేసే కార్యక్రమం రెండురోజుల నుంచి నిర్వహిస్తున్నామన్నారు. ఓటరు ఫెసిలిటీ సెంటర్లు, పోలింగ్ బూత్‌ల నిర్వహణ స్ట్రాంగ్‌రూమ్ కౌంటింగ్ సెంటర్‌లో ఏర్పాటు ప్రక్రియ అధికారులతో పర్యవేక్షణ చేసి ఏర్పాట్లను త్వరగా చేయాలని ఆదేశించామన్నారు. సమావేశంలో డీపీఆర్వో రవికుమార్, ఎలక్షన్ సూపరింటెండెంట్ రామేశ్వర్, ఎలక్షన్ డీటీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## శిలాఫలకం ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోండి

హుస్నాబాద్, నవంబర్ 22 : పట్టణంలోని ఐవోసీ భవనం సమీపంలో టీఎన్జీవో భవన నిర్మాణం కోసం ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని కొందరు గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారని, వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని టీఎన్జీవో హుస్నాబాద్ యూనిట్ అధ్యక్షుడు బి.పరశురాములు బుధవారం హుస్నాబాద్ పోలీస్‌స్టేషన్ చేశాడు. పట్టణ శివారులోని కిషన్‌నగర్‌లో ఐవోసీ భవనం పక్కన టీఎన్జీవో భవన నిర్మాణం కోసం సెప్టెంబర్ 13న మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ కలిసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారని, దీనిని కొందరు వ్యక్తులు కావాలనే ధ్వంసం చేశారని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. వెంటనే ఆ వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీఎన్జీవో నాయకులు పాల్గొన్నారు.

## రోయింగ్‌లో హుస్నాబాద్ విద్యార్థికి గోల్డ్ మెడల్



గోల్డ్ మెడల్ అందుకుంటున్న అభిజిత్ యాదవ్

హుస్నాబాద్ టౌన్, నవంబర్ 22 : జాతీయస్థాయి రోయింగ్ పోటీల్లో అండర్-13 విభాగంలో హుస్నాబాద్ పట్టణానికి చెందిన కాశబోయిన అభిజిత్ యాదవ్ గోల్డ్‌మెడల్ సాధించాడు. ఈ నెల 18 నుంచి 22 వరకు జాతీయస్థాయి రోయింగ్ పోటీలు హైదరాబాద్‌లో జరిగాయి. హుస్నాబాద్ పట్టణానికి చెందిన అభిజిత్ యాదవ్ తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. హైదరాబాద్‌లోని హుస్సేన్‌సాగర్‌లో నిర్వహించిన అండర్-13 రోయింగ్ డబుల్ పోటీల్లో బుధవారం గోల్డ్‌మెడల్ సాధించాడు. ఈ సందర్భంగా రోయింగ్ నేషనల్ కోచ్, ద్రోణాచార్య అవార్డు గ్రహీత ఇస్మాయిల్‌బేగ్ చేతులమీదుగా గోల్డ్‌మెడల్‌ను అందుకున్నాడు. గోల్డ్ మెడల్‌ను అందుకున్న అభిజిత్‌ను ప్రజాప్రతినిధులు అభినందించారు.